


# సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పది

- వారికి లభించే గౌరవం మరెవరికీ దక్కదు
- ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- దివ్యాంగుల సేవచేస్తున్న టీచర్లకు చిరు సత్కారం


వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 296
పేజీలు : 08 | వెల: రూ.5/-

శుక్రవారం
సెప్టెంబర్ 05, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




# గణపయ్యకు ఘనంగా వీడ్కోలు

## గంగమ్మ ఒడికి చేరుతున్న లంబోదరుడు



ఓరుగల్లులో గణపతి నవరాత్రులు ఆద్యంతం సందడిగా సాగాయి. విద్యుద్దీపకాంతులతో నగర వీధులు దేదీప్యమానంగా వెలిగిపోయాయి. ప్రత్యేక అలంకరణలతో గణపతి మండపాలు అందరినీ ఆకట్టుకున్నాయి. తొమ్మిది రోజులపాటు భక్తి శ్రద్ధలతో పూజలందుకున్న గణపతులు శుక్రవారం గంగమ్మ ఒడికి చేరుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, కోలాటాలతో స్వామి వారికి ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రధాన వీధుల గుండా తరలి వస్తున్న లంబోదరుడి ఊరేగింపులను చూసేందుకు రెండు కన్నులు చాలవన్నట్లుగా ఉంది. బాణసంచా కాల్చుతూ భక్తులు సందడి చేశారు. గణపతి గణపతి బప్పా మోరియా అన్న నినాదాలు మిన్నంటాయి. నిమజ్జనానికి తరలి వస్తున్న వినాయకులతో పల్లె, పట్నం అనే తేడా లేకుండా సందడి నెలకొంది. నిమజ్జనోత్సవానికి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రేటర్ పరిధిలో 24 ప్రాంతాల్లో గణపతులను నిమజ్జనం చేసేలా ఏర్పాటు చేశారు. చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద నిమజ్జన కార్యక్రమాన్ని గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన నిమజ్జన కార్యక్రమాల్లో వరంగల్, హనుమకొండ కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, స్నేహ శబరీష్, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, మేయర్ సుధారాణి, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు. –వరంగల్ వాయిస్ ప్రతినిధి

- భక్తి శ్రద్ధలతో సాగనంపుతున్న జనం
- గ్రేటర్ పరిధిలో 24 ప్రాంతాల్లో నిమజ్జన కార్యక్రమాలు
- భారీ ఏర్పాట్లు చేసిన అధికారులు
- తిలకించేందుకు తరలి వచ్చిన నగర ప్రజలు

వివరాలు 2లో..




2
WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శుక్రవారం, సెప్టెంబర్ 05, 2025



# గణపయ్యకు.. ఘనంగా వీడ్కోలు

- గంగమ్మ ఒడికి చేరుతున్న లంబోదరుడు
- భక్తి శ్రద్ధలతో సాగనంపుతున్న జనం
- గ్రేటర్ పరిధిలో 24 ప్రాంతాల్లో నిమజ్జన కార్యక్రమాలు
- భారీ ఏర్పాట్లు చేసిన అధికారులు
- తిలకించేందుకు తరలి వచ్చిన నగర ప్రజలు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొలి పూజలందుకునే గణపతి తొమ్మిది రోజుల పాటు భక్తుల చేత పూజలందుకుని కుడుములు, ఇతర నైవేద్యాలను ఆరగించి ఇవాళ గంగమ్మ చెంతకు పయనమయ్యారు. సెప్టెంబర్ 27 భాద్రపద శుద్ధ చవితి బుధవారం రోజు అంగరంగ వైభవంగా కొలువుదీరిన గణపయ్యకు పల్లె, పట్నం, చిన్న, పెద్ద, స్త్రీ, పురుష అనే తేడా లేకుండా పూజలు నిర్వహించారు. ఓరుగల్లులో గణపతి నవరాత్రులు ఆద్యంతం సందడిగా సాగాయి. గతంతో పోలిస్తే ఎక్కువగా విభిన్న గణపతులు కొలువుతీరాయి. ఇక ఎల్లంబజార్ లో 40 అడుగుల మట్టి గణనాధుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. మండపాల వద్ద నిత్య పూజలతో పాటు భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. సరస్వతీ, లక్ష్మీ, కుంకుమ పూజల్లో వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం, రాత్రి సమయాల్లోనూ మండపాల వద్ద పెద్ద ఎత్తున అన్నదానాలు నిర్వహించారు.

### భారీ ఏర్పాట్లు..

నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరిగేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. హనుమకొండ, వరంగల్, కాజీపేట పరిధిలో బంధం చెరువు, కోట మల్లన్న చెరువు, గుండం చెరువు, బెస్తం చెరువు, చినవడ్డేపల్లి చెరువు, రంగం సముద్రం చెరువు, సిద్దేశ్వర గుండం తదితర 24 చెరువుల వద్ద నిమజ్జనోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు. నిమజ్జనం సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉన్నాయి. సాధారణ పబ్లిక్ కు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎక్కడికక్కడ ట్రాఫిక్ ను నియంత్రించేలా ఏర్పాట్లు చేశారు.

### ప్రారంభించిన కమిషనర్..

వరంగల్ చిన్న వడ్డెపల్లి చెరువు వద్ద గణేష్ నిమజ్జన కార్యక్రమానికి గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహాత్ బాజ్ పాయి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మేయర్ గుండు సుధా రాణి, 22 డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమార్, 13 వ డివిజన్ కార్పొరేటర్ సురేష్ జోషి, 12 వ డివిజన్ కార్పొరేటర్ కావేటి



కవిత, వరంగల్ జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ వరంగల్ నగరంలోని ప్రధాన 17 చెరువులలో 6,500 విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. చిన్న వడ్డేపల్లి చెరువులోనే 4,000 విగ్రహాలు నిమజ్జనం చేసే అవకాశం ఉందన్నారు. అందుకు గాను ఏడు క్రేన్లు ఏర్పాటు చేశామని, సిబ్బంది షిఫ్టుల వారీగా విధులు నిర్వర్తిస్తారన్నారు. ఉర్సు గుట్ట చెరువులో వెయ్యి విగ్రహాలు, గురజాల చెరువు నర్సంపేటలో, పర్వతగిరి చెరువుల్లో నిమజ్జనానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఒక క్రేన్ కి మూడు షిఫ్ట్ లలో 30 మంది ఇరిగేషన్ అధికారులను చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.



### శ్రీజా హోమ్స్ లో..

హనుమకొండ హంటర్ రోడ్ నందిహిల్స్ లోని శ్రీజా హోమ్స్ అపార్ట్ మెంట్ లో గణేశ్ నవరాత్రులు ఘనంగా ముగిశాయి. శుక్రవారం అపార్ట్ మెంట్ వాసులు అభయ గణనాథుడికి ఘన వీడ్కోలు పలికారు. నవరాత్రుల సందర్భంగా అపార్ట్ మెంట్ లో తొమ్మిది రోజులు రోజువారీ పూజలతో పాటు కుంకుమ పూజలు, సరస్వతీ పూజ, దీపారాధన కార్యక్రమం, సాయినాథుడి పూజ, శాకాంబరీ పూజల్లో మహిళలు, చిన్నారులు, అందరూ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. దశాబ్దానికి పైగా గణేశ్ నవరాత్రుల వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. నిమజ్జన వేడుక సందర్భంగా సాంస్కృ తిక కార్యక్రమాలు అలరించాయి. ముగింపు వేడుకల్లో భాగంగా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేడుకల్లో అపార్ట్ మెంట్ కమిటీ కార్యవర్గం, గణేశ్ వేడుకల నిర్వహణ కమిటీ, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.





### ఉర్సు చెరువులో..

ఉర్సు రంగ సముద్రంలో శుక్రవారం గణపతుల నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వరంగల్ ఏసీపీ శుభం ప్రకాష్, 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి హాజరై నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మిల్స్ కాలనీ ఇన్ స్పెక్టర్ బొల్లం రమేష్, మహానగర పాలక సంస్థ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, డీఎంహెచ్ఓ సాంబశివరావు, ఎంపీడీవో దుగ్గొండి అరుంధతి, డాక్టర్ అనితలతోపాటు పలువురు అధికారులు తెప్పలో చెరువులోకి వెళ్లి నిమజ్జనం చేశారు.

## లక్ష్మీపతి బ్రదర్స్ ఆధ్వర్యంలో కారుపై ఏకాదశ వినాయకులు



**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** వరంగల్ నగరానికి చెందిన వంగరి లక్ష్మీపతి బ్రదర్స్ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా తన కారుపై ఏకాదశ వినాయకులను అందంగా అలంకరించి నగరంలో ఊరేగింపు నిర్వహించారు. కాశీబుగ్గలో ప్రారంభమైన ఊరేగింపు వరంగల్ చౌరస్తా, పోచమ్మ మైదాన్ మీదుగా ఊరేగింపుతో చిన్న వడ్డేపల్లిచెరువు వద్దకు వెళ్లి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా వంగరి లక్ష్మీపతి మాట్లాడుతూ తన కారుపై గత 12 సంవత్సరాలుగా వివిధ ఆకారాలతో వినాయకులను తీసుకువెళ్లి నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బందుమిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

## కమాండ్ కంట్రోల్ నుంచి శోభాయాత్ర పరిశీలన



గణేష్ నిమజ్జనం, శోభాయాత్రకు సంబంధించి పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు, నిమజ్జన ప్రాంతాలు, శోభాయాత్ర నిర్వహించే మార్గాలలో ప్రస్తుత స్థితిగతులపై వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీతి సింగ్ శుక్రవారం పోలీస్ కమిషనరేట్ కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షించారు. నిమర్జనం, శోభాయాత్ర కై ఏర్పాటు చేసిన 583 సీసీ కెమెరాలకు సంబంధించిన దృశ్యాలను కమాండ్ కంట్రోల్ ద్వారా పోలీసులు తిలకిస్తారని సీపీ పేర్కొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

శుక్రవారం, సెప్టెంబర్ 05, 2025

# బీసీ హాస్టల్ పై పట్టింపు ఏదీ?

◆ పేద విద్యార్థుల పట్ల ఇంత అలసత్వమా?

◆ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేష్



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల, ప్రజాప్రతినిధుల అలసత్వం వల్లే ఈ దుస్థితి నెలకొందని ఆయన విమర్శించారు. శుక్రవారం ప్రజా సంఘాల ప్రతినిధులతో కలిసి హాస్టల్‌ను సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. హాస్టల్‌లో పర్యవేక్షణ కొరవడిందని, టాయిలెట్లు, స్నానపు గదులు అపరిశుభ్రంగా ఉన్నాయని మాదాసి సురేష్ అన్నారు. హాస్టల్ ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాల వల్ల దోమలు, ఈగలు వృద్ధి చెంది విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని చెప్పారు. అంతేకాకుండా, విద్యార్థులు పడుకోవడానికి సరైన బెడ్లు కూడా లేకపోవడంతో నేలపైనే నిద్రిస్తున్నారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వం అంటే ఇదేనా అని ఆయన ప్రశ్నించారు.ప్రజా సంఘాల నాయకులు హాస్టల్‌ను సందర్శించిన సమయంలో వార్డెన్ సుష్మ అందుబాటులో లేరని, ఆమె విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని నాయకులు ఆరోపించారు. ఈ విషయమై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాదాసి ఎర్ర సూరయ్య, మాదాసి ప్రభాకర్, గడ్డం స్వామి, వాచ్‌మెన్ తనుగుల రమేష్ పాల్గొన్నారు.

# ఘనంగా గణనాథుడి నిమజ్జన వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ వరంగల్ కార్పొరేట్ కార్యాలయంలో గణేష్ నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని ఉదయం గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యం సమర్పించి ప్రారంభించారు. సుమారు 200 మంది ఉద్యోగులు డప్పు చప్పుళ్లు, నృత్యాలతో నిమజ్జన వేడుకలో పాల్గొన్నారు. హనుమకొండలోని ప్రధాన కార్యాలయం ఎదుట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, స్వామివారిని భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఈ వేడుకల్లో క్లస్టర్ మేనేజర్ వేముల వినోద్ కుమార్, బ్రాంచ్ మేనేజర్లు కొయ్యాడ లక్ష్మయ్య, గరిపల్లి శ్రీనివాస్, బీఏ మేనేజర్లు పెంచల అశోక్, డోలి రాజ్‌కుమార్, మామిడాల అనిల్, బత్తిని రాజేష్‌తో పాటు టాటా ఏఐఏ నాయకులు పాల్గొన్నారు.

# మోడీ చిత్రపటానికి పాలాభిషేకం



**వరంగల్ వాయిస్, గణపురం :** కేంద్ర ప్రభుత్వం ప్రజలకు దసరా, దీపావళి కానుకగా వస్తు సేవల పన్ను (జీఎస్టీ) రేట్లను భారీగా తగ్గించడాన్ని స్వాగతిస్తూ బీజేపీ గణపురం మండల శాఖ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు ఊర నవీన్ రావు నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం స్వతంత్ర భారతంలో వచ్చిన విప్లవాత్మక పన్ను సంస్కరణ అని కొనియాడారు. సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానున్న ఈ మార్పుల వల్ల నిత్యావసరాలు, ఆహార పదార్థాలపై పన్నును 18శాతం నుంచి 12, 5, 0 శాతానికి తగ్గించడం జరిగిందని ఆయన తెలిపారు. అలాగే, వ్యవసాయ యంత్రాలు, స్పేర్ పార్టులు, ఎరువులపై పన్నును 18శాతం, 12 నుంచి 5శాతానికి తగ్గించారని చెప్పారు. ఇంకా, ఆరోగ్య బీమా, జీవిత బీమా ప్రీమియంపై పన్నును 18శాతం నుంచి 0 శాతానికి తగ్గించడం దేశ ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు సోమా దామోదర్, బీజేవైఎం కళాశాలల విభాగం రాష్ట్ర కన్వీనర్ మంద మహేష్, మండల ప్రధాన కార్యదర్శి చెలుమల్ల ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు మాదాసు మొగిలి, నాయకులు బిల్లా దేవేందర్, మండల రాజు, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

# స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో టీచర్స్ డే వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో హనుమకొండలోని స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో టీచర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పరకాల ఆర్.డి.ఓ. నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఆశ్రమంలోని ఉపాధ్యాయులను సత్కరించి అభినందించారు. పిల్లలు ఆటపాటలతో సందడి చేశారు. పిల్లలకు పుస్తకాలు, స్టేషనరీ, మిఠాయిలు పంపిణీ చేశారు. హాజరైన వారందరూ ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పరకాల ఆర్.డి.ఓ. నారాయణ, డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ.. “ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పది. ఐఏఎస్, ఐపీఎస్, లాయర్, డాక్టర్, రాజకీయ నాయకులు వంటి గొప్ప గొప్ప వ్యక్తులందరూ ఒకనాడు ఉపాధ్యాయులకు శిష్యులే. ప్రపంచానికి దిశానిర్దేశం చేసే వ్యక్తిని తయారు చేసేది ఒక ఉపాధ్యాయుడే. ప్రతి వ్యక్తి జీవితంలో కీలక పాత్ర పోషించేది వారే” అని అన్నారు. “మానసిక దివ్యాంగులు, బధిరులైన పిల్లలకు బోధించడం చాలా సవాలుతో కూడుకున్న పని. ఎంతో ఓపిక, ప్రేమ అవసరం. అందుకే ఇక్కడ బోధించే ఉపాధ్యాయులను సన్మానించడం అంటే వారిని గౌరవించుకోవడమే” అని అతిథులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుచరిత, రాజేందర్ రెడ్డి, వసుధ, హరిత తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనంలో దాస్యం దంపతులు



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్, ఆయన సతీమణి రేవతి భాస్కర్ శుక్రవారం బాలసముద్రంలోని భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యాలయంలో జరిగిన వినాయక నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. వినాయక చవితి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక ప్రతిమకు తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమజ్జనం రోజున ‘సీడ్ గణేష్’ ప్రతిమను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలు, భారతీయులు అందరూ ఎంతో భక్తిశ్రద్ధలతో, విశ్వాసాలతో గణేష్ నవరాత్రులు నిర్వహించుకున్నారని అన్నారు. సకల జనులు సుఖసంతోషాలతో జీవించాలని ఆయన గణనాథుడిని ప్రార్థించారు.

# డిస్నీల్యాండ్ లో ఘనంగా గురుపూజోత్సవం



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని ఓగులాపూర్‌లోని డిస్నీల్యాండ్ హైస్కూల్‌లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం, గణేష్ నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ముఖ్య సలహాదారులు దయ్యాల మల్లయ్య, దయ్యాల సదయ్య, బాలుగు లక్ష్మీ నివాసం, కరస్పాండెంట్ బాలుగు శోభా రాణి, డైరెక్టర్లు దయ్యాల రాకేష్ భాను, దయ్యాల దినేష్ చందర్‌లు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత సమాజంలో గురువులకు ప్రత్యేక స్థానం ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయులు కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా, జీవిత పాఠాలు కూడా బోధించి విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యతను కలిగి ఉంటారని చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగి, ఉపాధ్యాయుల సలహాలు పాటిస్తూ మంచి విద్యార్థులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు 70 మంది ఉపాధ్యాయులను సన్మానించి గురుభక్తిని చాటుకున్నారు. విద్యార్థుల ఉపన్యాసాలు, కవితలు, పాటలు, నృత్యాలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. గురుపూజోత్సవం అనంతరం సుమారు 850 మంది విద్యార్థులతో కలిసి వినాయక నిమజ్జనం కూడా నిర్వహించారు. నిర్వహించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి



**వరంగల్ వాయిస్, నడికూడ :** పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు, నడికూడ మండల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో కౌకొండ, సర్వాపూర్, ధర్మారం గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నడికూడ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి (చందు) మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిగా నెరవేర్చలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన అభివృద్ధి పనులను కూడా పూర్తి చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. అలాగే, రైతన్నలకు అత్యవసరమైన యూరియాను అందుబాటులో ఉంచకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మేడిపల్లి శోభన్, మాదారం పాక్స్ చైర్మన్ నల్లెల లింగమూర్తి, సమన్వయ కమిటీ సభ్యులు సుధాటి వెంకటేశ్వర్ రావు, మండల అధికార ప్రతినిధి లింగాల తిరుపతి, మండల నాయకులు పాలకుర్తి సదానందం, మండల యూత్ నాయకులు సురాబు శ్రీకాంత్, గుడికందుల శివ, దండు సుధాకర్, పిల్లల సుమంత్, కౌకొండ గ్రామ కమిటీ అధ్యక్షుడు ముక్కెర రాజు, సర్వాపూర్ గ్రామ ముఖ్య కార్యకర్తలు, ధర్మారం గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి పిల్లల తిరుపతి, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు, యూత్ నాయకులు, స్థానిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ తగ్గింపుపై ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** జీఎస్టీ స్లాబ్ తగ్గింపుతో ప్రజలకు ఊరట కలిగించినందుకు ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి శుక్రవారం శాయంపేట మండల కేంద్రంలో బీజేపి నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమాన్ని బీజేపీ మండల అధ్యక్షులు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాయరాకుల మొగిలి మాట్లాడుతూ.. "ప్రధాని మోడీ తీసుకుంటున్న ఆర్థిక నిర్ణయాలు ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఉంటాయి. జీఎస్టీ స్లాబ్ తగ్గింపుతో వ్యాపారులకు, వినియోగదారులకు లాభం చేకూరుతుంది. సాధారణ ప్రజల భారాన్ని తగ్గించడానికి తీసుకున్న ఈ నిర్ణయం ప్రధాని మోడీ ప్రజల పట్ల ఉన్న ప్రేమకు నిదర్శనం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు కోడెపాక స్వరూప, యువ మోర్చా జిల్లా నాయకులు కొత్తపల్లి శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శి భూతం తిరుపతి, మండల ఉపాధ్యక్షుడు కోమటి రాజశేఖర్, కార్యదర్శి మేకల సుమన్, బూత్ అధ్యక్షులు భాసని నవీన్, కన్నబోయిన రమేష్, కూరాకుల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి కరాటేలో మెరిసిన పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థులు




**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద కాకతీయ స్కూల్‌లో గురువారం నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీల్లో అన్నారం పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. కఠోర శ్రమ, క్రమశిక్షణ, నైపుణ్యంతో వివిధ స్థాయిల్లో విజయం సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చారు. విద్యార్థులు సాధించిన అద్భుత విజయం పట్ల పాఠశాల యాజమాన్యం సంతోషం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించింది. విజేతలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

# పొడిచెట్టి విష్ణువర్ధన్ కు కాకతీయ కీర్తి పురస్కారం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ విశ్వవిద్యాలయం ఉద్యోగి డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్‌ను సామాజిక సేవా రంగంలో ఆయన చేసిన విశేష కృషికి గాను కాకతీయ కీర్తి పురస్కారంకు ఎంపిక చేశారు. ఈ విషయాన్ని శ్రీ శాంతి కృష్ణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ శాంతి కృష్ణ ఆచార్య ఒక ప్రకటనలో తెలిపారు. విష్ణువర్ధన్ కాకతీయ విశ్వవిద్యాలయంలో ఉద్యోగిగా పనిచేస్తూనే, పాత్రికేయునిగా ప్రజలకు ఉపయోగపడే అనేక అంశాలను వెలుగులోకి తెచ్చారు. అదేవిధంగా, సామాజిక కార్యకర్తగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో ఆయన ఆదర్శంగా నిలిచారని డాక్టర్ శాంతి కృష్ణ పేర్కొన్నారు. ఈ కృషిని గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 7న కాళోజీ కళాక్షేత్రంలో జరిగే శ్రీ శాంతి కృష్ణ సేవా సమితి 40వ వార్షిక వసంతోత్సవం సందర్భంగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిర్వహించే కాకతీయ కళావైభవం అనే అంతర్జాతీయ వేదికపై ముఖ్య అతిథుల సమక్షంలో విష్ణువర్ధన్‌కు ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌ను పలువురు అభినందించారు.

# మదర్ థెరిస్సా జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం

■ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కాజీపేట :** మదర్ థెరిస్సా జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆమె వర్ధంతి సందర్భంగా శుక్రవారం కాజీపేట ఫాతిమా నగర్ కూడలి వద్ద ఉన్న మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ మదర్ థెరిస్సా ప్రపంచానికి ప్రేమ, దయ, నిస్వార్థ సేవ అంటే ఏమిటో తన జీవితంతో చూపించారని కొనియాడారు. ఆమె అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, పేదలకు, అనాథలకు మాతృప్రేమను పంచారని చెప్పారు. ఆమె సేవా దృక్పథం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలవాలని అన్నారు. యువతలో సేవాభావాన్ని పెంపొందించేందుకు ఆమె జీవితాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో నాయకులు రమాకాంత్ సాగరిక, డివిజన్ అధ్యక్షుడు రమేష్, వరంగల్ డయాసిస్ పాలనాధికారి ఫాదర్ విజయపాల్, ఫాతిమా కతీడ్రల్ చర్చి విచారణ గురువు ఫాదర్ కాసు మర్రెడ్డి, విచారణ కమిటీ అధ్యక్షుడు బొక్కా దయాసాగర్, విగ్రహ కమిటీ కన్వీనర్ రాజ్ మోహన్ రావు, కూరపాటి వెంకట నారాయణ, సిద్దిఖీ, తిరునహరి శేషు తదితరులు పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్తుకు ఉపాధ్యాయులే నిర్మాతలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పుస్తకాల్లోని పాఠాలతో పాటు జీవిత పాఠాలు నేర్పే వారే నిజమైన సద్గురువులని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన తన గురువు రావిశెట్టి రాజేశ్వర్ రావును టీచర్స్ కాలనీలోని ఆయన ఇంటికి వెళ్లి సన్మానించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు తరగతి గదిలో నిర్మితమవుతుందని, ఆ నిర్మాతలు గురువులేనని కొనియాడారు. ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని, వారు తమ జీవితాలను విద్యార్థుల భవిష్యత్తు కోసం త్యాగం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వినయ్ భాస్కర్ తన గురువు రావిశెట్టి రాజేశ్వర్ రావుతో పాటు ఆయన కుటుంబ సభ్యులను కూడా సన్మానించారు.

# దామెర ఎంఈఓ రాజేష్ కు పురస్కారం



**హనుమకొండ, వరంగల్ వాయిస్ :** జిల్లాలో ఉత్తమ మండల విద్యాశాఖ అధికారిగా దామెర మండల విద్యాశాఖ అధికారి లకావత్ రాజేష్ కుమార్ ఎంపికయ్యారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో ఈ అవార్డును ఆయన అందుకున్నారు. జిల్లా కలెక్టర్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ చేతుల మీదుగా దామెర ఎంఈఓకు ఈ అవార్డును ప్రదానం చేశారు. విద్యా రంగంలో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది.

# డాక్టర్ చిర్ర రాజు గౌడ్ కు విద్యా రత్న అవార్డు



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుడు, తెలుగు విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ చిర్ర రాజు గౌడ్ కు ప్రతిష్టాత్మకమైన "విద్యారత్న పురస్కార అవార్డు" లభించింది. ఎస్ఆర్ఎఫ్ శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఈ అవార్డుకు ఆయనను ఎంపిక చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం సెమినార్ హాల్లో జరిగిన గురుపూజోత్సవ సన్మాన కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి జయప్రకాష్ నారాయణ చేతుల మీదుగా డాక్టర్ రాజు గౌడ్‌కు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఎస్ఆర్ఎఫ్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ అమరేష్ ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా తుమ్మ అమరేష్ మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా విద్యా రంగానికి డాక్టర్ రాజు గౌడ్ విశేష సేవలు అందించారని కొనియాడారు. విద్యార్థులకు జ్ఞానాన్ని అందిస్తూ, ఒక ప్రతిభావంతుడైన విద్యావేత్తగా ఆయన నిలిచారని తెలిపారు. అందుకే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా విద్యారంగంలో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ ఏడాది విద్యారత్న అవార్డును అందజేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 200 మంది ఉపాధ్యాయులకు "గురుబ్రహ్మ అవార్డులు" అందించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎఫ్ ఫౌండేషన్ అడ్వైజర్ చిరంజీవి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా మహా అన్నప్రసాద వితరణ

◆ హాజరైన ఏసీపీ ప్రశాంత్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండల కేంద్రంలో విశ్వసాయి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్నదానం అన్ని దానాలలో కెల్లా గొప్పదని ఏసీపీ ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన విశ్వసాయి యూత్‌ను ఆయన అభినందించారు. గణపతి ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అలాగే, కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి ఉండాలని సూచించారు. ఈ మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి సహకరించిన బాలసాని లత, రమేష్, సాయి తేజ గౌడ్‌లను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సురేష్, ఎంపీడీఓ గుండె బాబు, సీఐ హరికృష్ణ, డాక్టర్ నరేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలసాని రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# అత్యంత వైభవంగా గణపతుల నిమజ్జనం

## ◆ ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** మండలంలోని అన్ని గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరి రోజైన శుక్రవారం, భక్తులు గణనాథులను అంగరంగ వైభవంగా ఊరేగించి చెరువుల్లో నిమజ్జనం చేశారు. గణపతి ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గ్రామాల్లోని మండపాల వద్ద నుంచి గణనాథులను అందంగా అలంకరించిన వాహనాలపై ఊరేగించారు. కోలాటాలు, డీజే పాటలు, నృత్యాలతో భక్త జనం సందడి చేశారు. ఆత్మకూరు, శాయంపేట మండలాలకు చెందిన వేలాది మంది భక్తులు కటాక్షపూర్ పెద్ద చెరువు వద్దకు చేరుకుని గణనాథులను నిమజ్జనం చేశారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి, పెంచికలపేట పద్మశాలి కాలనీలోని విక్టరీ యూత్, పెద్దపూర్ ఏ1 యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను పాటలు పాడుతూ, భజనలు చేస్తూ శోభాయాత్ర నిర్వహించి నిమజ్జనం చేశారు. నిమజ్జన కార్యక్రమాలను ఆర్డీఓ నారాయణ, ఏసీపీ సతీష్ బాబు, తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, సీఐ ఆర్ సంతోష్ కుమార్, ఎస్సైలు తిరుపతి, సతీష్, ఇతర రెవెన్యూ, పోలీసు అధికారులు దగ్గరుండి పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్లను కూడా అందుబాటులో ఉంచి, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు.

## ప్రతి కాలనీలో రోడు నిర్మాణాలు పూర్తి చేస్తా

**వరంగల్ వాయిస్, కాజీపేట:** శంకుస్థాపన చేసిన తక్కువ వ్యవధిలోనే అభివృద్ధి పనులు పూర్తి చేసి, ప్రారంభోత్సవాలు చేసుకుంటున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కాజీపేటలోని అంబేద్కర్ కాలనీలో సుమారు రూ. 90 లక్షల వ్యయంతో చేపట్టనున్న 61,62,63వ డివిజన్‌లకు సంబంధించిన అంతర్గత రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 21 నెలల కాలంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలను వర్షాల వల్ల నీట మునగకుండా కాపాడగలిగామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి శ్రీనివాస్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో అభివృద్ధికి నోచుకోని అనేక కాలనీలను కూడా ప్రస్తుతం అభివృద్ధి చేస్తున్నామని ఆయన చెప్పారు. అంతకుముందు, అంబేద్కర్ కాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నాయిని రాజేందర్ రెడ్డి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



## వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



**వరంగల్ వాయిస్, పరకాల:** పట్టణంలో వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరకాల ఏసీపీ సతీష్ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా తగు సూచనలు చేశారు. పరకాలలో జరుగుతున్న గణేష్ నిమజ్జన కార్యక్రమం సందర్భంగా ఏసీపీ సతీష్ బాబుతో పాటు సీఐ క్రాంతికుమార్, మున్సిపల్ కమిషనర్ సుష్మ, ఎంపీడీవో ఆంజనేయులు, కుంకుమేశ్వర ఆలయ చైర్మన్ రాజేశ్వరరావు, పరకాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు సన్నత్ కుమార్ పటేల్, మాజీ కౌన్సిలర్ మడికొండ సంపత్, బొచ్చు బాబు, మున్సిపల్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది కూడా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## రంయ్యాల శ్రీధరాచార్యులకు సన్మానం



**వరంగల్ వాయిస్, పోచమ్మ మైదాన్:** హనుమకొండ జిల్లా విద్యాశాఖ కార్యాలయం తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు–2023 గ్రహీత, ప్రముఖ వ్యాఖ్యాత, గాయకుడు, రంయ్యాల శ్రీధరాచార్యులను సన్మానించింది. వరంగల్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో హంటర్‌రోడ్‌లోని వేడుకల మందిరంలో గురుపూజోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీధరాచార్యుల వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా విద్యాశాఖ తరపున జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, ఏఎంఓ సుజన్ తేజ, డీసీఈబీ కార్యదర్శి కృష్ణమూర్తి, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ శ్రీనివాస్, జగదీశ్వర్, శ్రీధర్ తదితరులు సన్మానం చేశారు. శ్రీధరాచార్యుల పోచమ్మ మైదాన్‌లోని ఎల్.బీ.నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

# అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ

**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండలంలోని వంగపల్లి గ్రామంలో కొత్త అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఓడితల ప్రణవ్ బాబు సహకారంతో ఈజీఎస్ నిధుల నుంచి మంజూరైన రూ. 12 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్, ఎంపీడీవో గుండె బాబు ఈ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోడేటి భిక్షపతి, కొండ తిరుపతి, మార్కెట్ డైరెక్టర్ ఒరుసు తిరుపతి, మాజీ ఎంపీపీలు మాట్ల రమేష్, తడుక శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ డాక్టర్ మౌటం కుమారస్వామి, మాజీ మండల అధ్యక్షులు



పుల్లూరి శ్రీనివాసరావు, బొల్లం రాజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు గూడెపు మొగిలయ్య, పీఆర్ ఏఈ మధు, గ్రామ కార్యదర్శి చిలువేరు రవీందర్, మాజీ ఎంపీటీసీ రామస్వామి, మాజీ సర్పంచ్ పంజాల సారయ్య, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



### గణేష్ నగర్ కాలనీ ప్రారంభం..

కమలాపూర్ మండలం అంబాల గ్రామంలో హనుమకొండ హైవేకు సమీపంలో కొత్తగా ఏర్పడిన కాలనీకి గణేష్ నగర్ కాలనీగా నామకరణం చేసి బోర్డులను స్థాపించారు. ఈ కార్యక్రమాన్ని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ కెత్తే విజేందర్, మాజీ సర్పంచ్ కెత్తె రవి, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు గూడెపు మొగిలయ్య, కాలనీ నూతన అధ్యక్షుడు కుక్కల సురేందర్, కంకటి అశోక్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా



**వరంగల్ వాయిస్, నడికూడ :** ఇటీవల మృతి చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం నడికూడ మండలం రామకృష్ణాపురం గ్రామంలో వివిధ కారణాలతో మరణించిన సింగిరెడ్డి ఇంద్ర, యారా సంధ్యారాణి, ఎరుకల రాజు కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి మరణాలకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా, గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు ఎరుకల కృష్ణమూర్తి, ఎరుకల శ్రీనివాస్, పెండ్లి సాయిలను మాజీ ఎమ్మెల్యే పరామర్శించి, వారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పూజారి సాంబయ్యకు సిరిసిల్ల రాజయ్య నివాళి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ పూజారి సాంబయ్య గౌడ్ ఇటీవల మరణించిన సందర్భంగా, తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. శుక్రవారం ఆయన స్వగృహంలో సాంబయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పూజారి సాంబయ్య గౌడ్ మరణంపై సిరిసిల్ల రాజయ్య సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సాంబయ్య కుమారులు, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పరకాల మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, ఎంఏసీ డైరెక్టర్ దాసరి భిక్షపతి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రమౌళి, మాజీ సర్పంచ్ ఇనగల రమేష్, మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి రవి, పరకాల పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ మంద నాగరాజు, కాంగ్రెస్ నాయకులు బొచ్చు మోహన్, బొచ్చు భాస్కర్, బొచ్చు జెమిని, దుప్పటి సదయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్యామ్, యూత్ నాయకులు మంద వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేక విద్యార్థి ఆత్మహత్య



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** పాఠశాలకు వెళ్లడం ఇష్టం లేక ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నడికూడ మండలం అన్నారం షరీఫ్‌లో జరిగింది. ఈ సంఘటనపై పర్వతగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అన్నారం షరీఫ్‌కు చెందిన ఎర్నాగి శ్యామ్, వనజ దంపతుల కుమారుడు ఎర్నాగి సాత్విక్ (14). అతను అయినవోలు మండలం పున్నేలులోని ఏకశిల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. పాఠశాల హాస్టల్‌లో ఉంటూ చదువుకునే సాత్విక్, సెప్టెంబర్ 1న సెలవుపై ఇంటికి వచ్చాడు. సెప్టెంబర్ 4న ఉదయం 10 గంటలకు సాత్విక్‌ను పాఠశాలకు వెళ్లడానికి సిద్ధం కమ్మని అతని తండ్రి శ్యామ్ కోరారు. అయితే, సాత్విక్ వినాయక నిమజ్జనం తర్వాత వెళ్తానని చెప్పాడు. అదే సమయంలో శ్యామ్, అతని భార్య వనజ ఇద్దరు కలిసి అన్నారంలోని కెనరా బ్యాంకుకు పని నిమిత్తం వెళ్లారు. మధ్యాహ్నం 12:30 గంటలకు తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి, సాత్విక్ గదిలో తన తల్లి చీరతో ఉరివేసుకుని కనిపించాడు. పాఠశాలకు వెళ్లడం ఇష్టం లేక మనస్తాపం చెంది సాత్విక్ ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లుగా ప్రాథమిక సమాచారం. ఈ ఘటనపై మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు పర్వతగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శాయంపేట టీచర్లకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా విద్యాశాఖ ప్రకటించిన జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు శాయంపేట మండలం నుంచి నలుగురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. అల్లం మాధవి–జీహెచ్ఎం గ్రేడ్ 2 (నేరేడుపల్లి), శేఖర్ బాబు–ఎస్ఏ ఇంగ్లీష్ (జడ్పీహెచ్ఎస్, శాయంపేట గర్ల్స్), ఎస్.ఉదయశ్రీ – ఎస్ఏ తెలుగు (జడ్పీహెచ్ఎస్, శాయంపేట బాయ్స్), చల్ల అశోక్–ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం (ఎంపీపీఎస్, శాయంపేట) లు అవార్డులకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ తమ ఎంపికకు సహకరించిన హనుమకొండ జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాధికారి, మరియు శాయంపేట మండలంలోని ఇతర ఉపాధ్యాయులకు, సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత పటిష్టం చేయడానికి ఉత్సాహంగా పనిచేసి, శాయంపేట, హనుమకొండ విద్యాశాఖలకు మంచి పేరు తెస్తామని వారు హామీ ఇచ్చారు.

# నిమజ్జనం వేళ జాగ్రత్తలు అవసరం



**వరంగల్ వాయిస్, పరకాల :** శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించుకొని, నిమజ్జనానికి తరలివెళుతున్న భక్తులకు బీజేపీ రాష్ట్ర నాయకులు, పరకాల నియోజకవర్గ పోటీ చేసిన ఎమ్మెల్యే అభ్యర్థి, డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు పలు సూచనలు చేశారు. భక్తులు నిమజ్జనం సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. విద్యుత్ జాగ్రత్తలు: విద్యుత్ వైర్ల పట్ల జాగ్రత్త వహించాలి. ఊరేగింపు సమయంలో వైర్లకు విగ్రహాలు తగలకుండా చూసుకోవాలి. చిన్న వాహనాల్లో భారీ విగ్రహాలను తరలించవద్దు. రద్దీగా ఉండే సమయాల్లో విగ్రహాల ఊరేగింపును నివారించాలి. నిపుణులైన డ్రైవర్లను మాత్రమే నియమించుకోవాలి. ఊరేగింపు మార్గంలో చెట్ల కొమ్మలు అడ్డుగా ఉన్నాయేమో ముందుగానే చూసుకోవాలి. రోడ్లపై గుంతలు ఉన్న చోట నెమ్మదిగా వెళ్ళాలి. నిమజ్జనం కోసం దూర ప్రాంతాలకు వెళ్లవద్దు. అధికారులు కేటాయించిన మార్గాల ద్వారానే నిమజ్జనం ప్రదేశానికి చేరుకోవాలి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా భక్తి శ్రద్ధలతో నిమజ్జన ఉత్సవాన్ని జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

# వైభవంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

## దుర్గా కాలనీలో అన్నప్రసాద వితరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దుర్గా కాలనీలోని రోడ్ నెం. 1లోని శ్రీ కనకదుర్గ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 29వ సంవత్సర గణేష్ ఉత్సవాల సందర్భంగా అన్నప్రసాద భోజన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి దుర్గా కాలనీకి చెందిన సుమారు 500 మంది హాజరయ్యారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో కాలనీ వాసులకు ఆరోగ్యం, ఆనందం, సౌభాగ్యం కలగాలని కోరుతూ కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.ఈ అన్నప్రసాద కార్యక్రమానికి బైరి శ్రీనివాస్–రమా, బైరి సంతోష్ కుమార్, బైరి శ్రీరామ్, బైరి రతన్ రణ జై, ఇండ్ల కమల్ కుమార్, అనిల్ కుమార్, కిరణ్ కుమార్ (పెద్ద), ఇండ్ల కిరణ్ కుమార్ (చిన్న), యలుగు జితిన్ కుమార్, నెలల ప్రశాంత్, గీత్ చరణ్ కుమార్, జై చరణ్ కుమార్, జయదీప్, రణదీప్, గుడిపోయిన అనిల్, దామెర శ్రీధర్, దామర సతీష్, రాహుల్ సాయి, కలిమి వినయ్, దామెర మదన్మోహన్ తదితరులు నిర్వాహకులుగా వ్యవహరించారు.

# హసన్ పర్తిలో వైకుంఠధామం ధ్వంసం

## అస్థికల కోసం కుటుంబ సభ్యుల ఆందోళన



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** హనుమకొండ జిల్లా, గ్రేటర్ వరంగల్‌లోని మొదటి డివిజన్ పరిధిలో ఉన్న వైకుంఠధామంలో దహనం చేసిన తన తల్లి అస్థికల కోసం ఓ కుమారుడు ఆందోళన వ్యక్తం చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు వైకుంఠధామాన్ని ధ్వంసం చేయడంతో ఈ దుస్థితి ఎదురైందని ఆయన వాపోయాడు. గ్రేటర్ వరంగల్ మొదటి డివిజన్‌లోని ఎర్రగట్టు గుట్ట కాలనీలో మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ చొరవతో సుమారు


అస్థికలను వెతుకున్న కుటుంబసభ్యులు


వైకుంఠ ధామ కూల్చివేసిన తీరు

నాలుగేళ్ల క్రితం కాలువ కట్టపై వైకుంఠధామం నిర్మించారు. శ్రీనివాస కాలనీకి చెందిన విడపు ప్రతాప్ (గట్టయ్య కుమారుడు) తల్లి ఇటీవల మరణించగా, ఆగస్టు 29న ఆమె అంత్యక్రియలు ఇదే వైకుంఠధామంలో నిర్వహించారు. హిందూ సంప్రదాయం ప్రకారం అస్థికలు సేకరించడానికి వెళ్లగా, గుర్తు తెలియని వ్యక్తులు వైకుంఠధామాన్ని పూర్తిగా ధ్వంసం చేయడాన్ని ప్రతాప్ చూసి షాక్‌కు గురయ్యారు. ఆస్తిపాస్తుల కన్నా అమ్మ అస్థికలే విలువైనవని ప్రతాప్ రోదించారు. హిందూ సంప్రదాయం ప్రకారం, దహన సంస్కారాల తర్వాత అస్థికలను పవిత్ర నదుల్లో కలపడం అనాదిగా వస్తున్న ఆచారం. ఈ ఆచారానికి భంగం కలిగించడం వల్ల తన తల్లి ఆత్మకు శాంతి లేకుండా పోయిందని, తమ కుటుంబ సభ్యులు తీవ్ర మనస్తాపానికి గురయ్యారని ప్రతాప్ వాపోయారు. ఈ ఘటనకు కారణమైన దుండగులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు.

# ఉపాధ్యాయులకు సన్మానం



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి:** విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చే గురువులు దేవుడితో సమానమని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్ రావు అన్నారు. మాజీ రాష్ట్రపతి, తొలి ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా వాసవి క్లబ్ హసన్‌పర్తి ఆధ్వర్యంలో బాలాజీ గార్డెన్స్‌లో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంద్రు నాగేందర్ అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిదర రుద్రయ్య, చిదర రఘు, సంధ్యారాణి, పద్మ, శ్రీలత, వాసవి విద్యా మందిర్ నిర్వాహకుడు రాజేశ్వర్ రావులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చకిలం రాజేశ్వర్ రావు మాట్లాడుతూ సంపూర్ణ అక్షరాస్యత సాధించినప్పుడే, విజ్ఞానవంతమైన సమాజం ఏర్పడినప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని చెప్పారు. ఈ దిశలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి మాధవ శంకర్, జోన్ ఛైర్మన్ సుధీర్, జిల్లా జాయింట్ సెక్రటరీ శంకర్, మాజీ అధ్యక్షులు భీష్మనాధం, కృష్ణమూర్తి, శ్యామ్ సుందర్, కరంచంద్, రమేశ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# అచ్చ రజితకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని సిలోయం పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు అచ్చ రజితకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు లభించింది. హనుమకొండలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల సందర్భంగా శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్, జిల్లా కలెక్టర్ ఆమెకు ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా భీమదేవరపల్లి మండలం నుండి వచ్చిన పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు అచ్చ రజితకు అభినందనలు తెలిపారు.



# ఐక్యత సాధించడమే ప్రధాన లక్ష్యం

- 7న పద్మశాలి పరపతి సంఘాల సమావేశం
- గోడపత్రిక ఆవిష్కరించిన వైద్యం రాజగోపాల్

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** జిల్లా, పట్టణ పద్మశాలి పరపతి సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారుల సమావేశం సెప్టెంబర్ 7, ఆదివారం ఉదయం 9:30 గంటలకు నిర్వహించనున్నట్లు వైద్యం రాజగోపాల్ తెలిపారు. ఈ సమావేశం గురించి తెలియజేస్తూ గురువారం ఒక గోడపత్రికను విడుదల చేశారు. పద్మశాలి పరపతి సంఘాలను ఏకం చేసి, కుల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయపరచడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశంలో సంఘాల ఐక్యత సాధించి, పద్మశాలి సమాజానికి అవసరమైన కమ్యూనిటీ హాళ్లు, మార్కండేయ దేవాలయాలు, శ్మశానవాటికల సౌకర్యాలు కల్పించడం, అలాగే మార్కండేయ జయంతి, కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి, కార్తీక మాస వన భోజనాల వంటి సాంస్కృతిక కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించడంపై చర్చించనున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు, ప్రముఖ




జర్నలిస్ట్ వేముల నాగరాజు, ప్రముఖ జర్నలిస్ట్ గడ్డం కేశవ మూర్తి హాజరవుతున్నారు. ఈ సమావేశంలో ఒక ఎజెండాను రూపొందించి ముందుకు వెళ్లడానికి నిర్ణయించుకుంటారు. ఈ గోడపత్రిక విడుదల కార్యక్రమంలో మార్కండేయ సేవా సంఘం (కేఎల్ రెడ్డి కాలనీ) నుంచి అధ్యక్షులు వైద్యం రాజగోపాల్, కార్యదర్శి గైని సత్యనారాయణ, చక్రపాణి, సుధాకర్; మడికొండ పరపతి సంఘం నుంచి అధ్యక్షుడు కామని మల్లేశం, జాయింట్ సెక్రటరీ ప్రకాష్; శివ మార్కండేయ సంఘం నుంచి సప్త ఋషి సూర్యకిరణ్, కోశాధికారి అశోక్, పద్మనగర్ మార్కండేయ సంఘం నుంచి కార్యదర్శి గజ్జల అమరేందర్, కోశాధికారి బత్తుల సూర్యనారాయణ, కొత్తూరు పద్మశాలి మార్కండేయ సంఘం నుంచి కార్యదర్శి బింగి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త తరహాలో.. లిటిల్ హార్ట్స్



ఈటీవీ విన్ ప్రొడక్షన్ నుంచి వస్తున్న మొట్ట మొదటి థియేట్రికల్ సినిమా 'లిటిల్ హార్ట్స్'. '90స్ మిడిల్‌క్లాస్ బయోపిక్'తో యువతకు చేరువైన మౌళి తనూజ్ ఇందులో కథానాయకుడిగా నటించగా, ఆ చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు ఆదిత్య హసన్ దీనికి నిర్మాత కావడం విశేషం. స్కూల్ డేస్‌లోనూ... కాలేజీలోనూ మొగ్గ తొడిగిన ప్రేమకథలతో తరచూ సినిమాలు వస్తూనే ఉంటాయి. క్యాంపస్ స్టోరీలుగా, రొమాంటిక్ కామెడీ కథలుగా అవి తెలుగు ప్రేక్షకులకు సుపరిచితం. వాటికి భిన్నంగా కోచింగ్ సెంటర్ నేపథ్యంలో సాగే ప్రేమకథతో ఈ చిత్రం రూపొందింది. ట్రైలర్‌లో చెప్పినట్టే అంతగా చదువు అబ్బని ఓ అబ్బాయి, అమ్మాయి చుట్టూ తిరిగే కథ ఇది. చాలా సింపుల్‌గానే ఉంటుంది. కానీ, కావల్సినంత ఫన్‌ని పండిస్తుంది. యువతరం నేపథ్యంలో సాగే ఇలాంటి సరదా సరదా సినిమాలు ఈ మధ్య కాలంలో రాలేదు. కాత్యాయని పాట చుట్టూ అల్లిన సన్నివేశాలు ద్వితీయార్థానికి మరింత బలాన్ని ఇచ్చాయి. రచనలో ఉన్న బలం అది. హీరోయిన్ ఇంట్లో సన్నివేశాలు, హీరో తమ్ముడు చేసే అల్లరి, బాహుబలి రిజల్ట్‌ని హీరోహీరోయిన్ల ప్రేమకథతో ముడిపెడుతూ సినిమాని నడిపించిన తీరు... ఇలా ప్రతి ప్రయత్నం, ప్రతి పాత్ర నవ్వులు పంచేదే. ఇంటిల్లిపాదీ కలిసి ఆస్వాదించే స్వచ్ఛమైన హాస్యం ఈ సినిమాకి కలిసొచ్చే మరో అంశం.




# పుష్ప తరహాలో ..

**☐ అనుష్క నటించి మెప్పించిన ఘాటి**


సున్నితమైన కథలతో సినీప్రియుల్ని అలరించే దర్శకుడు క్రిష్ జాగర్లమూడి. అనుష్కను యాక్షన్ కోణంలో చూపిస్తూ 'ఘాటి' సినిమాని తీసుకొచ్చారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దుల్లోని తూర్పు కనుమల్లో జరిగే కథ ఇది. అక్కడి ఎత్తయిన పర్వతాల మధ్య ఓ కొండ నీడ మరో కొండపై పడే చోట నాలుగు రకాల గంజాయిలు పెరుగుతాయి. వాటిలో అత్యంత నాణ్యమైనది, ఖరీదైనది శీలావతి రకం. ఆ కనుమల్లో పండే ఈ గంజాయి పంటపై పూర్తి ఆధిపత్యం కాష్టాల నాయుడు (రవీంద్ర విజయ్), కుందుల నాయుడు (చైతన్య రావు) సోదరులదే. కనుమల్లో పండే గంజాయి పంటను ఘాటీ తెగ కూలీలు పోలీసుల కంట పడకుండా అక్రమంగా నాయుడు సోదరుల అడ్డాకు చేరవేస్తే.. దాన్ని వాళ్లు తమ బాస్ మహావీర్ (జిషు సేన్ గుప్తా)కు పంపుతారు. అతని కార్టెల్ దాన్ని దేశ విదేశాలకు అక్రమ మార్గాల్లో ఎగుమతి చేసి సొమ్ము చేసుకోవడం పరిపాటి. అయితే ప్రాణాలకు తెగించి గంజాయిని అక్రమ రవాణా చేసే ఘాటీలకు కష్టానికి తగ్గ ఫలితం, గౌరవం దక్కకపోవడంతో ఆ తెగకు చెందిన దేశీరాజు (విక్రమ్ ప్రభు) ఓ ఆలోచన చేస్తాడు. తన మరదలు శీలావతి (అను)తో పాటు– తోటి ఘాటీలతో కలిసి ఓ కొత్త దందాకు తెర లేపుతాడు. గంజాయిని ద్రవరూపంలోకి మార్చి దేశ విదేశాలకు ఎగుమతి చేయడం మొదలు పెడతారు. అయితే ఈ విషయం నాయుడు సోదరులకు తెలియడంతో ఘాటీలను అంతమొందించేందుకు సిద్ధమవుతారు. ఈ క్రమంలో శీలావతికి జరిగిన అన్యాయమేంటి? నాయుడు సోదరులతో ఆమె ఎలాంటి యుద్ధం చేసిందన్నదే సినిమా కథ. ఇది గంజాయి అక్రమ రవాణా నేపథ్యంలో సాగే కథగా కనిపించినప్పటికీ.. ప్రధానంగా ఇదొక ప్రతీకార కథ. . నిజానికి ఈ కథ.. దీంట్లోని స్మగ్లింగ్ నేపథ్యాన్ని చూస్తే 'పుష్ప' ఛాయల్లో నుంచి వచ్చిన సినిమాలాగే అనిపిస్తుంది. అయితే అందులో హీరో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ తన సామ్రాజ్యాన్ని అంతకంతకూ విస్తరించుకుంటూ వెళ్లే ప్రయత్నం చేయగా.. ఇందులో కథానాయిక గంజాయి స్మగ్లింగ్ వల్ల జరుగుతున్న అనర్థాల్ని, దారుణాల్ని చూసి ఆ స్మగ్లింగ్‌నే ఆపి తమ తెగతో పాటు ఎంతో మంది ప్రజల్ని కాపాడేందుకు నడుం బిగిస్తుంది.తూర్పు కనుమలు.. అక్కడి కొండల మధ్య సాగే గంజాయి అక్రమ సాగు.. దాన్ని దందాగా చేసుకుని బతికే నాయుడు సోదరులు.. అతనిపైనున్న కార్పొరేట్ ముఠాను చూపిస్తూ కథను ప్రారంభించిన తీరు ఆసక్తిరేకెత్తిస్తుంది. ఆ తర్వాత ఘాటి తెగను తెరపైకి తెచ్చి వాళ్ల నేపథ్యాన్ని.. గంజాయి స్మగ్లింగ్‌లో వాళ్ల శక్తి సామర్థ్యాల్ని పరిచయం చేశారు. ప్రథమార్ధమంతా ఓ సామాన్య మహిళగా కనిపించిన కథానాయిక పాత్ర.. ద్వితీయార్ధంలో ఆరంభం నుంచే అమ్మోరులా విజృంభించడం ప్రేక్షకుల్లో ఓ జోష్‌ను నింపుతుంది. ఈ క్రమంలో గుహలో నాయుడు ముఠాతో జరిగే యాక్షన్ సీక్వెన్స్, బస్సులో పోలీసు తల తెగ నరికే ఎపిసోడ్ రోమాంచితంగా ఉంటాయి. శీలావతిగా పూర్తి రా అండ్ రస్టిక్ లుక్‌లో అనుష్క ఆకట్టుకుంది. ఆమె ఇంత వరకూ ఈ తరహా పాత్రలో కనిపించలేదు. యాక్షన్ సన్నివేశాల్లోనూ అదరగొట్టింది. విద్యాసాగర్ పాటలు, నేపథ్య సంగీతం సినిమాకి బలాన్నిచ్చాయి. తూర్పు కనుమల అందాల్ని మనోజ్ తన కెమెరాతో చక్కగా ఒడిసిపట్టారు.

# ఫుల్ జోష్‌లో మన శంకర వరప్రసాద్ గారు

**తాజా షూటింగ్ షెడ్యూల్ విడుదల**

అనిల్ రావిపూడి దర్శకత్వంలో అగ్రకథానాయకుడు చిరంజీవి నటిస్తోన్న చిత్రం 'మన శంకర వరప్రసాద్‌గారు'. చిరుతో పాటు– ఈ సినిమా టీమ్ మొత్తం ఫుల్ జోష్‌తో ఉంది. తాజా అప్‌డేట్‌ను చిత్రబృందం షేర్ చేసింది. కొత్త షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలను పంచుకుంది. ఇప్పటికే ఈ సినిమా కేరళలో కొన్ని షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా మరో షెడ్యూల్‌ను ప్రారంభించారు. నేటి నుంచి సెప్టెంబర్ 19 దాకా చిత్రీకరణ జరగనుంది. ఇందులో రెండు పాటలు చిత్రీకరించనున్నట్లు– టీమ్ తెలిపింది. ఇవి కొత్త రికార్డులను సృష్టించడం ఖాయమని పేర్కొంది. సంక్రాంతికి ఈ సినిమాతో ప్రేక్షకులకు విజువల్ ట్రీట్ ఇవ్వనున్నట్లు– టీమ్ తెలిపింది. వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించనున్న ఈ మూవీని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. తాజాగా సాహు గారపాటి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ అక్టోబర్ 5 నుంచి నిర్వహించనున్న మరో షెడ్యూల్‌లో వెంకటేశ్ భాగం కానున్నట్లు– తెలిపారు ఇక వచ్చే ఏడాది చిరంజీవి వరుసగా రెండు సినిమాలతో అలరించనున్నారు. ఏడాది ప్రారంభంలో సంక్రాంతికి 'మన శంకర వరప్రసాద్‌గారు'తో సందడి చేసేందుకు సిద్ధమవుతుండగా.. వేసవిలో 'విశ్వంభర'తో పలకరించనున్నారు. వశిష్ఠ దర్శకత్వంలో సోషియో ఫాంటసీ ఫిల్మ్‌గా 'విశ్వంభర' ముస్తాబవుతోంది. ఇందులో వీఎఫ్ఎక్స్‌కు అధిక ప్రాధ్యానత ఉండగా.. 'మన శంకర వరప్రసాద్‌గారు'లో 5 శాతం మాత్రమే వీఎఫ్ఎక్స్ ఉపయోగించారు. 'విశ్వంభర'లో చిరు సరసన త్రిష కనిపించనుండగా.. 'మన శంకర వరప్రసాద్‌గారు'లో నయనతార నటిస్తున్నారు. ఈ రెండు సినిమాల ప్రచార చిత్రాలు ఆకట్టుకోవడంతో వీటిపై అంచనాలు నెలకొన్నాయి.





## కాంతారా-2లో రిషబ్ యాక్షన్ సన్నివేశాలు

కన్నడ నటుడు రిషబ్ శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'కాంతార చాప్టర్ 1' 2022లో వచ్చిన 'కాంతార'కు ప్రీక్వెల్‌గా ఇది సిద్ధమవుతోంది. రిషబ్ స్వీయ దర్శకత్వంలో ముస్తాబవుతోన్న ఈ సినిమా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది తాజాగా ఈ సినిమా స్టంట్ కొరియోగ్రాఫర్ అర్జున్ రాజ్ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఈ సినిమాలో యాక్షన్ సన్నివేశాలను రిషబ్ స్వయంగా చేశారని తెలిపారు. ఒక్క యాక్షన్ సన్నివేశంలో కూడా డూప్ ఉపయోగించలేదు. రిషబ్ రిస్క్ చేసి ఎన్నో స్టంట్స్ చేశారు. ఆయన కెరీర్‌లో ఇప్పటి వరకూ చేయని యాక్షన్ సన్నివేశాలను కూడా డూప్ లేకుండా చేశారు. కత్తి యుద్ధం, గుర్రపు స్వారీలతో పాటు– యుద్ధ కళగా ప్రాచుర్యం పొందిన కలరిపయట్టు–లోనూ శిక్షణ తీసుకున్నారు. నేను ఇప్పటి వరకూ చాలా మంది నటు–లతో వర్క్ చేశాగానీ రిషబ్‌లాంటి హీరోను చూడలేదు. 'నేను నా శాయశక్తులా ప్రయత్నిస్తాను అని అనడు.. నేను బ్రతికి ఉన్నంత వరకూ దీన్ని చేస్తాను' అని చెబుతాడు. ఆయన ఎంతో మందికి స్ఫూర్తి అంటూ స్టంట్ కొరియోగ్రాఫర్ అర్జున్ రాజ్ హీరో రిషబ్‌పై ప్రశంసలు కురిపించారు. కాంతార' రూ. 16 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి, రూ. 400 కోట్లు వసూళ్లు చేయడం విశేషం. తొలిభాగం కథ ఎక్కడి నుంచి ప్రారంభమైందో.. దానికి ముందు జరిగిన సంఘటనలను 'కాంతార చాప్టర్ 1'లో చూపించనున్నారు. పంజుర్లికి సంబంధించిన సన్నివేశాలు ప్రీక్వెల్‌లో ఎక్కువగా ఉండనున్నాయి. ముందుగా కన్నడలో విడుదలై హిట్‌గా నిలిచిన 'కాంతార'.. ఆ తర్వాత ఇతర భాషల్లో డబ్ అయిన సంగతి తెలిసిందే. 'కాంతార 2'ను ఒకేసారి అన్ని భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పది

- వారికి లభించే గౌరవం మరెవరికీ దక్కదు
- ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- దివ్యాంగుల సేవచేస్తున్న టీచర్లకు చిరు సత్కారం



**వరంగల్ వాయిస్, హనుమకొండ** : సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని, ఉపాధ్యాయుడికి లభించే గౌరవం మరెవరికీ దక్కదని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనో వికాస కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అమె పాల్గొని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. టీచర్స్ డే సందర్భంగా మానసిక దివ్యాంగ చిన్నారులు ఉపాధ్యాయుల వేషధారణలో అలరించారు. చిన్నారులను ఆప్యాయంగా పలకరించిన ఎంపీ వారి ఆరోగ్యం, చదువుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. విద్యార్థి జీవితానికి ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా నిలుస్తారన్నారు. నేటి విద్యార్థులను రేపటి బావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత వారిపైనే ఉందన్నారు. ఉపాధ్యాయుల త్యాగం, కృషితోనే సమాజంలో ప్రతిభావంతులు వెలుగులోకి వస్తారని పేర్కొన్నారు. మానసిక వికలాంగుల భద్రత కోసం ఐరిస్ కెమెరా టెక్నాలజీని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన విషయాన్ని గుర్తు చేశారు. పండగ ఏదైనా దివ్యంగా చిన్నారులతో కలసి జరుపుకోవడం తనకు ఎంతో సంతోషంగా ఉంటుందని ఎంపీ అన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సేవలో అంకితభావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందికి ఎంపీ చిరు సత్కారం చేసి ప్రోత్సహించారు. అదేవిధంగా మల్లికాంబ మనోవికాస కేంద్ర అభివృద్ధి కోసం తాను ఎల్లప్పుడూ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పద్మ, ఫౌండర్ రామ లీల, ఈసీ మెంబర్లు సదానందం, కళ్యాణ్, ప్రముఖ ఇన్ ఫ్లూయెన్సర్ లోకేష్, టీచర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమాజ మార్గనిర్దేశకులు ఉపాధ్యాయులు

- రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్
- విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా గురుపూజోత్సవం



**వరంగల్ వాయిస్, హనుమకొండ** : సమాజ మార్గ నిర్దేశకులు ఉపాధ్యాయులేనని రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో హనుమకొండ జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో పూర్వ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురు పూజోత్సవం, ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి డాక్టర్ బండా ప్రకాష్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, డీఈవో వాసంతి, తదితరులు పూలమాలలు వేసిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర శాసనమండలి వైస్ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ మాట్లాడుతూ విద్య ఇచ్చిన గొప్ప అవకాశంతోనే ఈ స్థాయికి ఎదిగామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులే తనను ప్రభావితం చేశారని అన్నారు. పాఠశాల నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు తన ఉపాధ్యాయులు, అధ్యాపకుల బోధనలతో తీర్చిదిద్దడం వల్లనే ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపారు. జిల్లాలో 1,45,294 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండడం చాలా గొప్ప విషయం.. అభినందనీయమని అన్నారు. కొన్ని జిల్లాల్లో చదువుకునే వారి సంఖ్య తక్కువ శాతం ఉందని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండడానికి గల కారణాలను గతంలో పరిశీలించిన అనంతరం జిల్లాలో దాదాపు 22 ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాసులకు నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. సమావేశం అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 55 మంది ఉపాధ్యాయులను డాక్టర్ బండా ప్రకాష్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, డీఈఓ వాసంతి శాలువాలు, ప్రశంసా పత్రం, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ వేడుకల్లో భాగంగా ఉపాధ్యాయ వృత్తి గౌరవాన్ని తెలియజేస్తూ పలువురు ఉపాధ్యాయులు స్ఫూర్తి గీతాలను ఆలపించారు. హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హై స్కూల్ విద్యార్థినులు చేసిన స్వాగతం నృత్యం ఆకట్టుకుంది. మైనారిటీ కమిషన్ సభ్యులు దర్శన్ సింగ్, స్థానిక కార్పొరేటర్ ఏనుగుల మానసరాంప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గోపాల్, పాఠశాల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# తెలుగు టీచర్లకు జాతీయ అవార్డు

**రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా ప్రదానం**

**వరంగల్ వాయిస్, వరంగల్** : రెండు తెలుగు రాష్ట్రాలనుంచి ఒక్కొక్కరు చొప్పున ఇద్దరు తెలుగు టీచర్లు ప్రతిష్టాత్మకమైన జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి పెన్పహడ్ స్కూల్ కు చెందిన పవిత్ర, ఏపీ నుంచి పండిట్ నెహ్రూ జీవీఎంసీ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు తిరుమల శ్రీదేవికి జాతీయ అవార్డు అభించింది. టీచర్స్ డే సందర్భంగా శుక్రవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా వీరికి అవార్డులను ప్రదానం చేశారు. అదే విధంగా ప్రొఫెసర్ విభాగంలో ఏపీకి చెందిన విజయలక్ష్మి, దేవానందకుమార్, తెలంగాణకు చెందిన గోయల్, వినీత్ లు అవార్డులు స్వీకరించారు.



# నలుబోల ప్రమీలకు నివాళులు

**వరంగల్ వాయిస్, హనుమకొండ** : హనుమకొండ సగర వీధికి చెందిన స్వర్గీయ నలుబోల ప్రమీల సంవత్సరీకం కార్యక్రమం శుక్రవారం జరిగింది. వీనస్ కన్వెన్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె కుమారుడు నలుబోల రమేష్, కోడలు నాగలత, మనుమరాలు, బంధువులు, మిత్రులు పాల్గొన్నారు. దివంగత ప్రమీల చిత్రపటానికి వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, నెట్వర్క్ ఇంచార్జి సామల సూర్యప్రకాష్, పూజారి విజయ్ కుమార్, మైదంశెట్టి సాంబయ్య, కోమాకుల మధుకర్, సీత శ్యామ్ తదితరులు తదితరులు పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు.





# భవిష్యత్ తరాలకు గురువులు దిక్సూచి

- ఆకుతోట ఫంక్షన్ హాల్ లో ఘనంగా గురుపూజోత్సవం
- ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**వరంగల్ వాయిస్, వరంగల్** : తరగతి గదుల్లో దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే మార్గదర్శకులు గురువులని గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా వరంగల్ లోని ఆకుతోట ఫంక్షన్ హాల్లో శుక్రవారం మేయర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డిలతో కలసి జ్యోతి ప్రజలను చేసి గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ విద్యతోపాటు విలువైన జ్ఞానాన్ని నేర్పించేది గురువులని అన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఉపాధ్యాయులు భావితరాల నిర్మాతలన్నారు. వారి చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు, సమాజ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని, మంచి సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులు నైతిక విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని పేర్కొన్నారు. ప్రతిభావంతులుగా మనందరినీ తీర్చిదిద్దిన గురువులను ఈరోజు స్మరించుకోవడం చాలా ఆనందాన్నిస్తుందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య మాట్లాడుతూ విద్య ఇచ్చిన గొప్ప అవకాశంతోనే ఈ స్థాయికి ఎదిగామని పేర్కొన్నారు. జన్మిఇచ్చిన తల్లిదండ్రులకు ఎంత ప్రాముఖ్యం ఉంటుందో ఉపాధ్యాయులకు అంతకంటే రెట్టింపు గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించినట్లయితే ప్రభుత్వ పాఠశాలల్లో సంఖ్య పెరుగుతుందన్నారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ నేడు ఈ స్థానంలో ఉండడానికి కారణం విద్యను అందించిన గురువులేనని గుర్తు చేశారు. ఉపాధ్యాయుల నుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జీవిత చరిత్ర మనందరికీ ఆదర్శం అని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. అనంతరం వరంగల్ జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 62 మందిని అతిథుల చేతుల మీదుగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ విజయలక్ష్మి, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీఈఓ రంగయ్య నాయుడు, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు, మండల విద్యాధికారులు, అవార్డు గ్రహీతలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE. EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com